




Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com








ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 608 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 10 బుధవారం డిసెంబర్2025 పేజీలు : 4 వెల : అమూల్యం


## రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష...

ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించిన అసైన్డ్ భూములపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5,74,908 ఎకరాల అసైన్డ్ భూముల వివరాలను క్షుణ్ణంగా పునఃపరిశీలించాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం అమరావతిలో రెవెన్యూ శాఖ పనితీరుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఫ్రీహోల్డ్ విధానంతో పాటు 22ఏ (బి-ఫారం) రీసర్వే, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాలపై ఈ సమీక్షలో చర్చించారు.






### ఆంధ్రప్రదేశ్ క్రియేటివ్ ఎకానమీకి

## గ్లోబల్ అవకాశాలు

- 'క్రియేటర్ ల్యాండ్' ప్రాజెక్ట్‌కు కాన్వా భాగస్వామ్యాన్ని ఆహ్వానించిన మంత్రి నారా లోకేష్
- సాన్‌ఫ్రాన్సిస్కోలో కాన్వా ప్రముఖులతో భేటీ
- అమరావతిని ప్రపంచస్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ సిటీగా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగు
- యువతకు సృజనాత్మక నైపుణ్యాలు, డిజిటల్ ఉద్యోగాల్లో విస్తృత అవకాశాలు

అమరావతి, డిసెంబర్ 9

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటనలో భాగంగా సాన్‌ఫ్రాన్సిస్కోలో డిజిటల్ డిజైన్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థైన కాన్వా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాన్వా చీఫ్ కస్టమర్ సక్సెస్ అధికారి రాబ్ గిగ్లియోతో ఆయన విస్తృత చర్చలు నిర్వహించారు. రాష్ట్ర యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించే దిశగా ఈ సమావేశం ముఖ్య అడుగుగా నిలిచింది. మంత్రి లోకేష్ మాట్లాడుతూ, అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగానే కాకుండా, ప్రపంచస్థాయి వినోద%-%సృష్టి నగరంగా (ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ) తీర్చిదిద్దే పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను క్రియేటివ్ ఎకానమీ కేంద్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న 'క్రియేటర్ ల్యాండ్' ప్రాజెక్ట్కు కాన్వా భాగస్వామ్యం అందించాలన్న ఆహ్వానాన్ని ఆయన అందించారు.

### సోనియా గాంధీకి

## ఢిల్లీ కోర్టు నోటీసులు

-పౌరసత్వానికి ముందే ఓటర్ల జాబితాలో సోనియా పేరు చేరిందంటూ పిటిషన్

-సోనియా గాంధీ, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసిన ప్రత్యేక కోర్టు

-కింది కోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌పై విచారణ

-ఫోర్జరీ పత్రాలతో పేరు చేర్చారని పిటిషనర్ ఆరోపణ




కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు మంగళవారం నోటీసులు జారీ చేసింది. భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే, అంటే 1980లోనే ఆమె పేరు ఓటర్ల జాబితాలో చేరిందన్న ఆరోపణలపై దాఖలైన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌ను న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారంపై సోనియా గాంధీతో పాటు ఢిల్లీ పోలీసులకు కూడా నోటీసులు పంపింది.వికాస్ త్రిపాఠి అనే వ్యక్తి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

### ఆయనకు రాజకీయంగా

## ఒక్క శత్రువు కూడా లేరు:

-డిసెంబర్ 11 నుంచి 25 వరకు
'అటల్ సందేశ్ యాత్ర'

-యాత్రలో పాల్గొనాలని కూటమి ప్రజాప్రతినిధులకు
సీఎం చంద్రబాబు పిలుపు

-వాజ్‌పేయిని రాజకీయ భీష్ముడిగా
అభివర్ణించిన వైనం








# ఆత్మాహుతి దాడులు ఇస్లాంలో నిషేధం...

## ఖురాన్ లో ఉగ్రవాద భావజాలానికి తీవ్ర ఖండన

న్యూ ఢిల్లీ, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 09 : గత నెల 10న ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన విషాదకరమైన కార్ బాంబు పేలుళ్లో కనీసం 15 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన ఘటన దేశాన్ని కలచివేసింది. ఈ దాడికి సంబంధించి నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ ఉమర్ ఉన్ నబీకి సంబంధించిన ఒక కలతపెట్టే వీడియో వెలుగులోకి వచ్చింది. వైద్య నిపుణుడైన అతడు, ఆత్మాహుతి బాంబు దాడులను బలిదాన ఆపరేషన్గా వివరిస్తూ వాటికి మతపరమైన రంగు పూయడానికి ప్రయత్నించాడు. పలు జాతీయ మీడియా సంస్థల దర్యాప్తు కథనాల ప్రకారం, ఈ వీడియో యువతను తప్పుదారి పట్టించే ఉద్దేశంతో రూపొందించబడినదిగా అధికారులు భావిస్తున్నారు. ఆత్మహత్యను బలిదానంగా అభివర్ణించడం కొత్త విషయం కాదు. తీవ్రవాద సంస్థలు చాలా కాలంగా ఈ భాషాపరమైన వక్రీకరణతో హింసను మతపరమైన కర్తవ్యంగా ప్రచారం చేస్తున్నాయి. కానీ మాటల మాయాజాలం దైవీక న్యాయాన్ని మార్చలేరు. ఖురాన్ స్పష్టమైన ఆజ్ఞ ఇచ్చింది ఆత్మహత్య నిషిద్ధం. ఖురాన్ సూరహ్ అన్-నిసా (4:29)లో, మిమ్మల్ని మీరు చంపుకోకండి. అల్లాహ్ మీ పట్ల దయగలవాడు అని స్పష్టంగా ఆజ్ఞాపిస్తుంది. ఈ వాక్యం అన్ని సందర్భాల్లో వర్తించే సార్వత్రిక నిషేధం. అలాగే సూరహ్ అల్-బఖరా (2:195)లో, మీ చేతులతో మిమ్మల్ని మీరు విధ్వంసంలోకి నెట్టవద్దు అని హెచ్చరిస్తోంది. ఒకరు తనపై తానే పేలుడు పదార్థాలు కట్టుకుని జనసమూహంలోకి వెళ్లడం, తాను మరణిస్తానని తెలిసే చేయడం ఈ ఆజ్ఞకు ప్రత్యక్ష ఉల్లంఘనే. హనఫీ, మాలికీ, షాఫీ, హన్బలీ, షియా మత సంస్థలు కూడా ఉద్దేశపూర్వక ఆత్మహత్యను ఏ పరిస్థితుల్లోనూ అనుమతించవు. ఉద్దేశ్యం ఏదైనా కావచ్చు, అది హరామ్. షహదత్ (బలిదానం) అర్థాన్ని వక్రీకరించడం ఉగ్రవాదులు తరచూ సూరహ్ అత్-తౌబా (9:111), సూరహ్ అల్-బఖరా (2:154) వంటి వచనాలను ఉదహరిస్తారు. కానీ ఇవి అన్యాయంగా శత్రువుల చేతిలో చంపబడినవారిని మాత్రమే "షాహిద్"గా పేర్కొంటాయి. అమాయక పౌరులను చంపుతూ, తానే తన మరణాన్ని కోరుకోవడం ఇస్లాం ప్రకారం షహదత్ కాదు, ఘోర నేరం. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహివసల్లం స్పష్టంగా చెప్పారు. ఎవరు తనను తానే చంపుకుంటారో, అతడు పరలోకంలో కూడా అదే శిక్షను అనుభవిస్తాడు. (హదీస్ గ్రంథాలు సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం) ఒక ప్రాణాన్ని చంపితే మొత్తం మానవాళిని చంపినంత మహా పాపం. ఖురాన్ సూరహ్ అల్-మాయిదా (5:32)లో "ఎవరు ఒక ప్రాణాన్ని అన్యాయంగా హతమార్చుతారో, అతడు మొత్తం మానవాళిని హతమార్చినట్టే" అని చెబుతుంది. ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఈ పవిత్ర సూత్రానికి పూర్తిగా విరుద్ధం. కుటుంబాలు, పిల్లలు, పర్యాటకులు వంటి అమాయకులు ఈ ఘోరానికి బలయ్యారు. ఇది ఏ మతంతోనూ సమర్థించలేని నేరం. ప్రపంచ ముస్లిం పండితుల ఘాటైన ఖండన" ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ఇస్లామిక్ పండితులు ఆత్మాహుతి దాడులను ఖండిస్తూ ఫత్వాలు జారీ చేశారు. అమ్మాన్ సందేశం, అల్-అజార్ విశ్వవిద్యాలయం, సౌదీ అరేబియా గ్రాండ్ ముఫ్తీ, అయతుల్లా సిస్తానీ, షేక్ తాహిర్-ఉల్-ఖాద్రీ వంటి ప్రముఖులు ఈ దాడులను ఇస్లాంలో నిషిద్ధమైన కుఫ్ర్ చర్యలుగా ప్రకటించారు. వైద్యుడే హింసకు ప్రచారకుడిగా మారడం దురదృష్టకరం, ప్రాణాలను కాపాడాల్సిన వైద్యుడు మృతికి మతపరమైన న్యాయీకరణ చేయడం మరింత బాధాకరం. డాక్టర్ నబీ వీడియోలో కనిపించిన ప్రశాంతత, వాస్తవానికి తీవ్ర రాడికలైజేషన్‌కు చిహ్నంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. భారత ముస్లింల వైఖరి శాంతి, సహనమే పునాది" భారతదేశంలోని ముస్లింలు ఎప్పటికప్పుడు ఉగ్రవాదాన్ని ఖండిస్తూనే వస్తున్నారు. దేవ్‌బంద్, జమియత్ ఉలామా ఏ హింద్



వంటి సంస్థలు అన్ని రకాల హింసను స్పష్టంగా తిరస్కరించాయి. ఇస్లాం బోధనల సారాంశం రహం (దయ), అద్ల్ (న్యాయం), సుల్,హ్ రహ్మా (శాంతి). నిజమైన బలిదానం ప్రతీకారం కాదు ప్రాణాలను రక్షిస్తూ న్యాయాన్ని సమర్థించడమే. ఖురాన్ చివరగా మరోసారి గుర్తు చేస్తుంది "ఎవరు ఒక ప్రాణాన్ని రక్షిస్తారో, అతడు మొత్తం మానవాళిని రక్షించినట్టే" (5:32). "ముగింపుగా" ఆత్మాహుతి బాంబు దాడులను బలిదానంగా చిత్రీకరించడం ఖురాన్‌కు, ఇస్లాం మూల సిద్ధాంతాలకు, మానవీయ విలువలకు పూర్తి విరుద్ధం. ఇటువంటి వక్రీకరించిన కథనాలను ప్రామాణిక ధార్మిక జ్ఞానంతో ఎదుర్కోవాల్సిన అవసరం ప్రతి పౌరుడిపై ఉంది. జీవితం పవిత్రమైనది, దాని పేరుతో హింస చేయడం దైవదూషణ ఇదే ఇస్లాం యొక్క కాలాతీత సందేశం.

# సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు నోటీసులు

1983 ఏప్రిల్‌లో సోనియా గాంధీకి భారత పౌరసత్వం లభించగా, అంతకుముందే 1980లో న్యూఢిల్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఆమె పేరును చేర్చారని పిటిషనర్ ఆరోపించారు. ఫోర్జరీ, తప్పుడు పత్రాలు సమర్పించడం వల్లే ఇది సాధ్యమైందని, దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. అయితే, ఈ పిటిషన్‌ను మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు సెప్టెంబర్ 11న కొట్టివేసింది.కింది కోర్టు తీర్పును సవాలు చేస్తూ త్రిపాఠి ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పవన్ నారంగ్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించి, ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను 2026 జనవరి 6వ తేదీకి వాయిదా వేశారు.గతంలో మెజిస్ట్రేట్ కోర్టు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 329 ప్రకారం ఎన్నికల సంబంధిత అంశాలలో న్యాయస్థానాల జోక్యం పరిమితంగా ఉంటుందని పేర్కొంటూ పిటిషన్‌ను తోసిపుచ్చింది. అయితే, ఇది ఎన్నికల ప్రక్రియకు సంబంధించినది కాదని, ఫోర్జరీ వంటి క్రిమినల్ నేరానికి సంబంధించినదని పిటిషనర్ వాదిస్తున్నారు. ఈ అంశం గతంలో రాజకీయంగానూ చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే.

# రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష...

ప్రభుత్వ పనితీరులో ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రీవెన్స్‌ల పరిష్కార నివేదికను సీఎం ముందుంచారు. గతేడాది జూన్ 15 నుంచి ఈ ఏడాది డిసెంబర్ 1 వరకు తమ శాఖకు మొత్తం 5,28,217 ఫిర్యాదులు అందాయని, వాటిలో ఇప్పటికే 4,55,189 పరిష్కరించామని అధికారులు సీఎంకు వివరించారు. మరో 73 వేల ఫిర్యాదులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది జూన్ నుంచి పాలనా సంస్కరణలు, ఆటోమేషన్ ప్రక్రియల కారణంగా గ్రీవెన్స్‌ల పరిష్కారం గణనీయంగా వేగవంతమైందని అధికారులు పేర్కొన్నారు.

భూముల రీసర్వే, 22ఏ జాబితాకు సంబంధించిన పురోగతిని అధికారులు చంద్రబాబుకు వివరించారు. రాష్ట్రంలోని 6,693 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి చేసి, వివరాలను వెబ్ ల్యాండ్ 2.0 పోర్టల్‌లో నమోదు చేశామని తెలిపారు. రీసర్వేలో పొరపాట్లకు తావులేకుండా రికార్డుల అప్‌డేషన్ ప్రక్రియలు చేపట్టామని, ఇది భూ సంబంధిత సమస్యలను తగ్గించడానికి దోహదపడుతుందని వివరించారు.

అదేవిధంగా, 22ఏ జాబితా నుంచి భూములను తొలగించాలని కోరుతూ జూన్ నుంచి ఇప్పటివరకు 6,846 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఎక్స్-సర్వీస్‌మెన్, రాజకీయ బాధితులు, స్వాతంత్ర్య సమరయోధులు, 1954కు ముందు అసైన్డ్ భూములు పొందిన వారి భూములను నిబంధనల ప్రకారం 22ఏ జాబితా నుంచి మినహాయించినట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత పెంచేందుకు రాష్ట్రంలో 2.77 కోట్ల కుల ధృవీకరణ పత్రాలను ఆధార్‌తో అనుసంధానిస్తున్నట్లు అధికారులు చెప్పగా, సీఎం అభినందించారు. దీనివల్ల అనర్హులను గుర్తించడం సులభమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.10,169 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లక్ష్య సాధనకు తీసుకుంటున్న చర్యలను సీఎంకు వివరించారు. సమీక్ష సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భూ రికార్డుల విషయంలో పూర్తి పారదర్శకత ఉండాలని, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. డిజిటల్ ప్రక్రియలను వేగవంతం చేయడం ద్వారా భూ సంబంధిత వివాదాలను తగ్గించి, పేదలకు వారి హక్కులు అందేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనాన్ని, సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ సంస్కరణలు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.



# ఈసీని బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోంది

ఎన్నికల కమిషన్ (ఈసీ)ను అడ్డం పెట్టుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. మంగళవారం లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఈసీ స్వతంత్రతను దెబ్బతీస్తున్నారని, పక్షపాతంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) తప్పు చేసినా శిక్ష పడకుండా చట్టాలను మార్చారని రాహుల్ విమర్శించారు. ఓట్ల దొంగతనంపై తాము ఎన్నో ఆధారాలు సమర్పించినా ఈసీ నుంచి కనీస స్పందన కరువైందని మండిపడ్డారు. బీజేపీకి అనుకూలంగానే ఎన్నికల షెడ్యూళ్లను ప్రకటిస్తున్నారని, పోలింగ్ ముగిసిన 45 రోజుల తర్వాత సీసీటీవీ ఫుటేజీని ధ్వంసం చేయాలనే నిబంధన ఎందుకని ఆయన ప్రశ్నించారు. హర్యానా ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన ఒక మోడల్‌కు 23 ఓట్లు ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఓటర్ల జాబితాలను ఎలా తారుమారు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని అన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి రాహుల్ గాంధీ మూడు కీలక ప్రశ్నలు సంధించారు.

1. సీఈసీ స్వయంప్రతిపత్తి ఎందుకు బలహీనపడుతోంది? దాని స్వతంత్రతను నిర్ధారించే యంత్రాంగాలను ప్రభుత్వం పునరుద్ధరిస్తుందా?
2. ఎస్ఐఆర్ ప్రక్రియలపై అనేక రాష్ట్రాల నుంచి ఫిర్యాదులు అందుతున్న సమయంలో, ఓటర్ల జాబితాలను తారుమారు చేయకుండా నిరోధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
3. ఈసీ నియామకాలు, నిర్ణయాలు రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఎందుకు కనిపిస్తున్నాయి? ఈ విషయంలో పారదర్శక సంస్కరణలు చేపట్టడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందా?... అని ప్రశ్నించారు.

# ఫ్రీ అండ్ ఫేర్ ఎన్నికల నిర్వహనే లక్ష్యంగా, జిల్లా వ్యాప్తంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు..

**-ఎలాంటివి అక్రమ రవాణ జరగకుండా పకడ్బందీగా చెక్ పోస్ట్ ల నిర్వహణ..**

**-సుమారు 1100 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో మూడు అంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు..: -జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

సంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 09 :మొదటి విడత స్థానిక ఎన్నికలు సంగారెడ్డి, కంది, కొండాపూర్, సదాశివపేట, పటాన్ చెర్వు (భానూర్), గుమ్మడిదల, హత్నూర మండలాలలో మొత్తం 136 గ్రామ పంచాయితీలకు గాను 7-ఏకగ్రీవం కాగా, 129 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని, ఎన్నికలను ప్రశాంత వాతారణంలో నిర్వహించేదుకు అన్నిరకాల భద్రత ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యాత్మక, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి, నిఘా కట్టుదిట్టం చేయడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, పోలింగ్ డే రోజున ఎలాంటి వాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అవసరమైన చర్యలను తీసుకోవడం జరిగిందని, ప్రహరీ గోడ లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించి, తాత్కాలిక ప్రహరీలను ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. పోలింగ్ డే రోజున ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండవలసిన కనీస వసతులు ఉండేలా చూడాలని సంబంధిత ఎస్.హెచ్.ఓ లకు సూచనలు చేశారు. పోలింగ్ ముగియడానికి 44 గంటల ముందు నుండి 09-12-2025 సాయంత్రం 5 గంటల నుండి పోలింగ్ పూర్తయ్యేవరకు సభలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారం పూర్తిగా నిషేదం అన్నారు. మద్యం, డబ్బుల పంపిణీ చేసినా, ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగించిన ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సోషల్ మీడియాలో, ఇతర ప్రసార మాధ్యమాలలో వ్యక్తులను గాని, రాజకీయ పార్టీలను గాని కించపరిచేలా తప్పుడు ప్రచారాలు చేసినా అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు.

పంచాయితిరాజ్ సెక్షన్ 219: పోలింగ్ కేంద్రాలలో లేదా సమీపంలో ప్రచారం చేయడం నిషేధం. పోలింగ్ కేంద్రం నుండి నిర్దిష్ట దూరంలో ప్రచారం చేయడం, ఓట్లను వేయమని అడగడం, ఓటర్ల ఒప్పించడం మొదలైనవి చేయకూడదు.

పంచాయితిరాజ్ సెక్షన్ 220: పోలింగ్ స్టేషన్, పోలింగ్ కేంద్రం సమీపంలో ఇష్టానుసారంగా ప్రవర్తించినందుకు జరిమానా. లౌడ్ స్పీకర్లు, అరుపులు, పోలింగ్ స్టేషన్ సమీపంలో ఓటర్లు/ఎన్నికల సిబ్బందికి ఇబ్బంది కలిగించే విధంగా క్రమరహితంగా ప్రవర్తించడం నేరం, శిక్ష: 3 నెలల వరకు జైలు శిక్ష లేదా జరిమానా విధించడం జరుగుతుంది. పంచాయితిరాజ్ సెక్షన్ 223: పోలింగ్ స్టేషన్‌కు లేదా సమీపంలోకి ఆయుధాలతో వెళ్లడం నిషేధం పోలింగ్ స్టేషన్‌కు ఆయుధాలతో వెళ్ళితే శిక్షార్హులు (అధికారిక పోలీసులు/అధికారులు కాకుండా).

శిక్ష: 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా.

పంచాయితిరాజ్ సెక్షన్ 225: ఏ ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ఏజెంట్, పోలింగ్ ఏజెంట్ లేదా కౌంటింగ్ ఏజెంట్‌గా వ్యవహరించకూడదు.












## కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ - కిర్లంపూడి ఎంపీపీ తోట రవి

కిర్లంపూడి, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 09 : కోటి 80 లక్షల రూపాయలతో ఎనర్జీఎస్ నిధులతో కిర్లంపూడి మండలం వీరవరం నుండి భూపాలపట్నం బిటి రోడ్డు నిర్మాణం పనులను పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీర్ ఉమాశంకర్ తో కలిసి కిర్లంపూడి ఎంపీపీ తోట రవి పనులను పరిశించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తోట రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టిందని ముఖ్యంగా జగ్గంపేట శాసనసభ్యుడు జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు, లింక్ రోడ్లు నిర్మాణ పనులు జరుగుతున్నాయని శ్రీ, అందులో భాగంగా కిర్లంపూడి మండలం వీరవరం గ్రామం నుండి భూపాలపట్నం గ్రామం వరకు నూతనంగా నిర్మిస్తున్న కోటి 80లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు పనులు శరవేయంగా సాగుతున్నాయని, పూర్తి కావస్తున్నాయని తోటరవి తెలియజేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా ఈ రోడ్డు పనులు చేపట్టామని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. ఎన్నో సంవత్సరాలుగా నుండి భూపాలపట్నం వెళ్లే రోడ్డు ఎంతో అద్వానంగా తయారవ్వడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఈ రోడ్డు పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. తొందరలోనే రోడ్డు నిర్మాణం పూర్తిచేసి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు.

## ప్రముఖ ఫిల్మ్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ రూపొందించిన జీరో బడ్జెట్ షార్ట్ ఫిల్మ్ "అమ్ములు"కు అనూహ్య స్పందన!!



హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 09 : ప్రముఖ ఫిల్మ్ జర్నలిస్ట్ అండ్ అనలిస్ట్ ధీరజ అప్పాజీ తొలి ప్రయత్నంగా తెరకెక్కించిన లఘు చిత్రం "అమ్ములు". The CRY never heard - The TEARS never seen అనే ట్యాగ్ లైన్ తో 7 నిమిషాల నిడివితో రూపొందిన ఈ సందేశాత్మక చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటికే వెయ్యి "ఆర్గానిక్ వ్యూస్" రాబట్టిన ఈ షార్ట్ ఫిల్మ్ లోని మెసేజ్ అందరినీ అమితంగా ఆకట్టుకుంటోంది. మొదటి ప్రయత్నంలోనే రచయితగా, దర్శకుడిగా, నటుడిగా మంచి మార్కులు సంపాదించుకున్న అప్పాజీని పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు. వెంకట్ విహారి సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ అందించిన ఈ చిత్రానికి కథ-మాటలు-స్క్రీన్ ప్లే-నిర్మాణం-దర్శకత్వం : ధీరజ అప్పాజీ!!

## భారత్‌లో మైక్రోసాఫ్ట్ అత్యంత భారీ పెట్టుబడి...

ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్‌లో అత్యంత భారీ పెట్టుబడికి సిద్ధమైంది. దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాన్ని బలోపేతం చేసేందుకు ఏకంగా రూ.1.5 లక్షల కోట్లు (17.5 బిలియన్ డాలర్లు) పెట్టుబడిగా పెట్టనున్నట్లు ప్రకటించింది. మంగళవారం నాడు ప్రధాని నరేంద్ర మోదీతో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. ఆసియాలోనే మైక్రోసాఫ్ట్ పెడుతున్న అతిపెద్ద పెట్టుబడి ఇదేనని సత్య నాదెళ్ల తెలిపారు. రానున్న నాలుగేళ్లలో (2026-2029) ఈ నిధులను వెచ్చించనున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ పెట్టుబడి ద్వారా భారత్‌లో ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యాల అభివృద్ధి, సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తామని ఆయన వివరించారు. ఈ సమావేశంపై సత్య నాదెళ్ల ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "భారత్ ఏఐ అవకాశాలపై ప్రధాని మోదీతో స్ఫూర్తిదాయకమైన చర్చ జరిగింది. దేశ ఆశయాలకు మద్దతుగా ఈ పెట్టుబడి పెడుతున్నాం" అని పేర్కొన్నారు. ఈ ప్రకటనపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. "ఏఐ విషయంలో ప్రపంచం భారత్ వైపు ఆశాభావంతో చూస్తోంది. సత్య నాదెళ్లతో ఫలవంతమైన చర్చ జరిగింది. ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడికి భారత్‌ను ఎంచుకోవడం సంతోషకరం" అని మోదీ తన పోస్ట్‌లో తెలిపారు. దేశ యువత ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని, ఏఐ శక్తిని సృజనాత్మకంగా వినియోగించుకుంటుందన్న విశ్వాసాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. ఇప్పటికే భారత్‌లో హైదరాబాద్, పుణే వంటి నగరాల్లో బలమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న మైక్రోసాఫ్ట్ తాజా పెట్టుబడి... దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు, స్టార్టప్‌లకు భారీ ఊతమిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# కోడుమూరులో టీడీపీకి భారీ షాక్



కోడుమూరు

కోడుమూరు నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. సి బెలగల్ మండలంలోని కంపాడు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు, అభిమానులు, పెద్దలు, యువతతో కలిసి మొత్తం 150 కుటుంబాలు ఈ రోజు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, కుడా మాజీ చైర్మన్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి , కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ కొత్తగా చేరిన కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కోడుమూరు ప్రాంతంలో ప్రజలు టీడీపీపై విసుగు చెందారని, అభివృద్ధి, సంక్షేమం ఆగిపోయిందన్నారు. ప్రజల పక్షాన నిలిచిన వైయస్ఆర్‌సీపీ వైపు అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని అన్నారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక న్యాయం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచినట్లు తెలిపారు. పార్టీలో చేరిన ప్రజలు మాట్లాడుతూ..టిడిపి ప్రభుత్వం పేదలను పట్టించుకోవడం లేదన్నారు, గ్రామాభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వైయస్ఆర్‌సీపీ పార్టీ ప్రజల కోసం నేలమీద పనిచేస్తుందని నమ్మకంతో ఆ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి, జిల్లా బూత్ కమిటీ కార్యదర్శి తులసి రెడ్డి , నాయకులు కార్యకర్తలు తదిరులు పాల్గొన్నారు.

# వి. శాంతారామ్ బయోపిక్‌లో కథానాయికగా తమన్నా

ముంబై %-% డిసెంబరు 9
భారతీయ సినీ చరిత్రలో మహోన్నత స్థానాన్ని సంపాదించిన దిగ్గజ దర్శక%-%నట%-%నిర్మాత వి. శాంతారామ్ జీవితం ఇప్పుడు వెండితెరపై రూపుదిద్దుకోబోతోంది. ఆయన పేరును వర్తమాన తరాలకు పరిచయం చేసే ఈ భారీ బయోగ్రాఫికల్ చిత్రం బాలీవుడ్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమవుతోంది. ఈ జీవితకథా చిత్రానికి 'వి. శాంతారామ్' అనే పేరునే ఖరారు చేశారు. ప్రధాన పాత్రలో యువ నటుడు సిద్దాంత్ చతుర్వేది నటిస్తుండగా, దర్శకుడిగా అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే సిద్దాంత్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసిన చిత్రబృందం, ఇప్పుడు హీరోయిన్‌గా తమన్నా భాటియాను అధికారికంగా ప్రకటించింది. ఆమె ఆకట్టుకునే ఫస్ట్ లుక్‌ను కూడా విడుదల చేశారు. ఈ భారీ ప్రాజెక్టును రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాష్ కాలే, సరిత అశ్విన్ వర్దే కలిసి నిర్మిస్తున్నారు. సైలెంట్ సినిమాల యుగం నుంచి టాకీల కాలం, ఆపై రంగుల చిత్రాల దశ వరకు భారత సినీ ప్రపంచం ఎదుర్కొన్న మార్పులను, ఆ ప్రయాణంలో వి. శాంతారామ్ చేసిన అద్భుత కృషిని ఈ చిత్రం సజీవంగా చూపించబోతోంది. వి. శాంతారామ్ సినీ ప్రయాణం 1901 నవంబరు 18న మహారాష్ట్రలోని కోల్హాపూర్‌లో జన్మించిన శాంతారామ్, 1921లో నటుడిగా తొలి అడుగు వేశారు. తరువాత దర్శకుడిగా 55కు పైగా చిత్రాలు తీర్చిదిద్దారు. నిర్మాతగా 92 సినిమాలకు పైగా వ్యవహరించారు. ఆయన స్థాపించిన ప్రభాత్ ఫిల్మ్ కంపెనీ (1929), రాజ్‌కమల్ కళామందిర్ (1942) భారత చిత్ర పరిశ్రమకు చిరస్మరణీయ సంస్థలుగా నిలిచాయి. సినీ రంగానికి చేసిన అసమాన సేవలకు గాను భారత ప్రభుత్వం శాంతారామ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1985), మరణానంతరం




పద్మవిభూషణ్ (1992) పురస్కారాలతో గౌరవించింది. ఇప్పుడీ మహానుభావుడి ప్రయాణం తెరపై ఎలా ఆవిష్కృతమవుతుందో అన్న ఆసక్తి సినీ వర్గాల్లో పెరుగుతోంది.

## ప్రముఖ ఫిల్మ్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ రూపొందించిన జీరో బడ్జెట్ షార్ట్ ఫిల్మ్ "అమ్ములు"కు అనూహ్య స్పందన!!



హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, డిసెంబర్ 09 : ప్రముఖ ఫిల్మ్ జర్నలిస్ట్ అండ్ అనలిస్ట్ ధీరజ అప్పాజీ తొలి ప్రయత్నంగా తెరకెక్కించిన లఘు చిత్రం "అమ్ములు". The CRY never heard - The TEARS never seen అనే ట్యాగ్ లైన్ తో 7 నిమిషాల నిడివితో రూపొందిన ఈ సందేశాత్మక చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటికే వెయ్యి "ఆర్గానిక్ వ్యూస్" రాబట్టిన ఈ షార్ట్ ఫిల్మ్ లోని మెసేజ్ అందరినీ అమితంగా ఆకట్టుకుంటోంది. మొదటి ప్రయత్నంలోనే రచయితగా, దర్శకుడిగా, నటుడిగా మంచి మార్కులు సంపాదించుకున్న అప్పాజీని పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు. వెంకట్ విహారి సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ అందించిన ఈ చిత్రానికి కథ-మాటలు-స్క్రీన్ ప్లే-నిర్మాణం-దర్శకత్వం : ధీరజ అప్పాజీ!!

## సునయన యెల్ల - అరబ్ యూట్యూబర్ ఖలీద్‌తో పెళ్లి?

హైదరాబాద్ - డిసెంబరు 9
తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన నటి సునయన యెల్ల వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో దుమ్మురేపుతున్నాయి. 'కుమారి వర్సెస్ కుమారి'తో ఎంట్రీ ఇచ్చి, 'రాజ రాజ చోర'తో మంచి గుర్తింపు తెచ్చుకున్న సునయన, ఇటీవల నాగార్జున నటించిన 'కుబేర'లో కనిపించి మళ్లీ టాక్‌లోకి వచ్చింది. కానీ ఇప్పుడు ఆమె సినీ క్యారియర్ కాకుండా%ౌ% పెళ్లి వార్తే హాట్ టాపిక్. వైరల్ అవుతున్న సమాచారం ప్రకారం సునయన త్వరలోనే పాపులర్ అరబ్ కంటెంట్ క్రియేటర్ ఖలీద్ ఏఐ అమేరితో పెళ్లి పీటలెక్కబోతుందట. యూట్యూబ్‌లో 5.82 మిలియన్, ఇన్‌స్టాగ్రామ్‌లో 3.2 మిలియన్ ఫాలోవర్లు ఉన్న ఖలీద్ మధ్యప్రాచ్యంలో అత్యంత ప్రాచుర్యం పొందిన క్రియేటర్లలో ఒకరు. ఇటీవల ఆయన తన పుట్టినరోజు వేడుకల ఫోటోలను షేర్ చేశాడు. వాటిలో ఒక ఫొటోలో%ౌ%ఖలీద్%-%సునయన కలిసి కనిపించడం, అందమైన పుట్టినరోజు జరిపినందుకు ధన్యవాదాలు అంటూ క్యాప్షన్ పెట్టడం,
ఈ జంటపై నెటిజన్లకు కొత్త సంకేతం



ఇచ్చింది. దీంతో "ఇద్దరూ రిలేషన్‌లో ఉన్నారేమో?", "ఇప్పుడు పెళ్లేనా?" అంటూ చర్చలు ఒక్కసారిగా వైరల్ అయ్యాయి. సునయన కూడా గతంలో ఖలీద్ ప్రియురాలి చేతిలో కనిపించిన ఎంగేజ్‌మెంట్ రింగ్స్ ఉన్న ఫోటోను లైక్ చేయడం%ౌ% రూమర్లకు మరింత బలం చేకూర్చింది. గమనికగా చెప్పాలంటే
ఖలీద్ తన మాజీ భార్య సలామా మహ్మద్తో 2024లో విడాకులు తీసుకున్నారు. 2007లో పెళ్లయిన వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా, సునయన%-%ఖలీద్ ఎంగేజ్మెంట్ లేదా పెళ్లిపై ఇరువురూ అధికారికంగా మాత్రం ఇంకా ఏ ప్రకటన చేయలేదు. అభిమానులు మాత్రం త్వరలో ఈ క్రేజీ కపుల్ నుంచే ఏదో స్పష్టత వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

# స్పిరిట్‌లో ప్రభాస్ ఎంట్రీ సాంగ్‌దే థియేటర్లను షేక్ చేయనున్నదా?

### -భారీ సెట్‌పై తాజా అప్‌డేట్

హైదరాబాద్ %-% డిసెంబరు 9
పాన్ ఇండియా స్టార్ ప్రభాస్%-%సెన్సేషన్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తోన్న 'స్పిరిట్' సినిమాపై రోజురోజుకీ అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. 'అర్జున్ రెడ్డి', 'కబీర్ సింగ్', 'యానిమల్' తరహా రా%-%ఇంటెన్స్ కథలతో వంగా చూపించిన మాస్ మేకింగ్ స్టైల్ వల్ల, ఈసారి ప్రభాస్‌ను ఎలాంటి వైల్డ్ అవతారంలో చూపిస్తాడో అన్న ఆసక్తి గరిష్ఠానికి చేరింది. తాజా సమాచారం ప్రకారం'స్పిరిట్' కోసం ఒక అత్యంత భారీ పోలీస్ స్టేషన్ సెట్‌ను నిర్మిస్తున్నారు. ఇది సాధారణ సెట్ మాత్రమే కాకుండా, సినిమాలో కీలక పాత్ర పోషించేలా భారీగా, రియలిస్టిక్ స్టైల్‌లో ప్రత్యేక డిజైన్‌తో తయారవుతోంది. ఈ సెట్‌లోనే ప్రభాస్ ఎంట్రీ సాంగ్‌ను చిత్రీకరించడానికి ప్రిపరేషన్స్ జరుగుతున్నాయి. వంగా సినిమాల్లో హీరో ఎంట్రీ ఎంత వైల్డ్, ఎంత ఇంపాక్ట్‌ఫుల్‌గా ఉంటుందో ప్రేక్షకులందరికీ తెలిసిందే. అదే స్టైల్‌ను మించి, ప్రభాస్‌కు మరింత రా, అగ్రెసివ్, మాస్ ఎంట్రీని ఈసారి ప్లాన్ చేస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. పాటతోపాటు ఈ లొకేషన్‌లోనే ఒక భారీ యాక్షన్ ఎపిసోడ్ కూడా షూట్ చేయడానికి సిద్ధమవుతున్నారు. డార్క్ లైటింగ్, ఇంటెన్స్ ఫ్రేమింగ్, వంగా మార్క్ స్టైల్ గా ప్రేక్షకులను థియేటర్లలో తాళ్లతో ఉర్రూతలూగించేలా మాస్ ఎనర్జీ క్రియేట్ అవుతుందని టాక్. ఇన్‌సైడ్ బజ్ ప్రకారం, ప్రభాస్ ఇప్పటివరకు ఎప్పుడూ చేయని రీతిలో ఒక వైల్డ్, రఫ్, రా పోలీస్ ఆఫీసర్గా కనిపించబోతున్నారు. లుక్ నుంచి బాడీ లాంగ్వేజ్ వరకు, ఈ పాత్ర పూర్తిగా ఇంటెన్స్‌తో నిండిపోయి, వంగా ట్రీట్‌మెంట్‌తో మరో లెవెల్‌కు వెళ్లనుంది. ఇప్పటికే చిత్ర బృందం పూజా కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించింది. ప్రస్తుతం



భారీ సెట్లతో షూటింగ్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రతి కొత్త అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి.
ప్రభాస్%-%వంగా కాంబినేషన్ నుంచి ప్రేక్షకులకు కావలసిందిబ్లడ్ రష్ ఇచ్చే మాస్, ఎమోషన్, వైలెన్స్, ఆథారిటీవ్ పోలీస్ పవర్.
ఇవి అన్నీ 'స్పిరిట్'లో రెట్టింపు అవుతాయని సినీ విశ్లేషకుల అంచనా

# రస్సెల్ అరుదైన ఘనత

### - టీ20ల్లో చరిత్ర సృష్టించిన కెరేబియన్ ధాటివీరుడు



అబుదాబి డిసెంబర్ 9
కెరేబియన్ విధ్వంసకర ఆల్‌రౌండర్ అండ్రే రస్సెల్ టీ20 చరిత్రలో చిరస్మరణీయ అధ్యాయాన్ని రాశాడు. ప్రపంచవ్యాప్తంగా అన్ని లీగ్‌లను కలుపుకుని టీ20 ఫార్మాట్‌లో 5000కు పైగా పరుగులు, 500కు పైగా సిక్సులు, 500కు పైగా వికెట్లు పూర్తి చేసిన తొలి ఆటగాడిగా రస్సెల్ అరుదైన ఘనత నమోదు చేశాడు. ఈ మూడు విభాగాల్లోనూ ఒకేసారి ఇలాంటి రికార్డు సాధించడం ఇప్పటివరకు ఎవరూ చేయలేని విషయం. ఐఎల్టి 20లో అబుదాబి నైట్ రైడర్స్ తరఫున ఆడుతున్న రస్సెల్ తన 500వ టీ20 వికెట్‌ను తాజాగా సాధించాడు. మొత్తంగా 576 టీ20 మ్యాచ్‌లు ఆడిన రస్సెల్ ఇప్పటి వరకు 9496 పరుగులు, 772 సిక్సర్లు, 500 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. పవర్ హిట్టర్‌గా, డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా, బౌలర్‌గా ఇలా అన్ని వైపులా మ్యాచ్‌ను మార్చగలిగే అరుదైన ఆల్‌రౌండర్‌గా రస్సెల్ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నాడు. టీ20ల్లో 5000o పరుగులు, 500o వికెట్లు కలిగిన ఆటగాళ్ల జాబితాలో డ్వేన్ బ్రావో, షకీబ్ అల్‌హసన్ వంటి దిగ్గజాలు ఉన్నా%ౌ% మూడు విభాగాల్లోనూ (రన్స్%-%సిక్సులు%-%వికెట్లు) ఒకేసారి 500o మార్క్‌ను దాటిన ఏకైక క్రికెటర్‌గా రస్సెల్ నిలిచాడు. టీ20ల వేగవంతమైన ఫార్మాట్‌కు నిజమైన నిర్వచనం రస్సెల్ అన్నట్లుగా అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# ఇంగ్లండ్‌కు మరో షాక్



### - యాషెస్ నుండి వుడ్ ఔట్
### - కమిన్స్ అడిలైడ్‌కు రెడీ

హైదరాబాద్ %-% డిసెంబర్ 9
యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్‌కు ఎదురుదెబ్బలు ఆగేలా లేవు. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఘోర పరాజయాలు చవిచూసిన బెన్ స్టోక్స్ సేన మరోసారి బలహీనపడింది. ప్రధాన వేగి మార్క్ వుడ్ మోకాలి గాయం మళ్లీ తీవ్రం కావడంతో సిరీస్ మొత్తానికి తప్పుకున్నాడు. గబ్బా పోరులో ఆడలేని వుడ్, మిగిలిన మూడు టెస్టులకు కూడా అందుబాటులో ఉండడంలేదు. ఏడాది నుంచి గాయాలతో ఇబ్బంది పడుతున్న అతడు ఇప్పుడు స్వదేశంలోని పునరావాస కేంద్రంలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందనున్నాడు. ఇంతలో ఆస్ట్రేలియా జట్టుకూ దెబ్బ తప్పలేదు. తొడకండరాల గాయంతో తొలి రెండు టెస్టులకు దూరమైన జోష్ హేజిల్‌వుడ్ ఈ సిరీస్ మొత్తం తప్పుకుంటున్నాడు. అడిలైడ్ పోరుకు సిద్ధం కావాలన్న జట్టు ప్రయత్నం ఫలించలేదు. అయితే వచ్చే ఏడాది జరగబోయే ఇరవై ఇరవై ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని అతడిని పూర్తిగా కోలుకునేలా విశ్రాంతి ఇచ్చినట్లు ప్రధాన కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ తెలిపారు. ఆస్ట్రేలియా శిబిరంలో మరోవైపు శుభవార్త కూడా చేరింది. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న ప్యాట్ కమిన్స్ అడిలైడ్ టెస్టులో జట్టుని నడిపించబోతున్నాడు. తొలి రెండు పోరుల్లో ఆస్ట్రేలియాకు విజయాలు అందించిన స్టీవ్ స్మిత్ మూడో టెస్టులో ఉపసారథిగా కొనసాగనున్నాడు. డిసెంబర్ 17న ప్రారంభమయ్యే అడిలైడ్ పరీక్షలో కమిన్స్ రాకతో ఆస్ట్రేలియా బౌలింగ్ బలం మరింత పెరుగుతుందని విశ్లేషకుల అభిప్రాయం. తొలి రెండు మ్యాచ్‌ల్లోనే బలహీనతలు బయటపడిన ఇంగ్లండ్‌కు మార్క్ వుడ్ గైర్హాజరు మరింత చిక్కు పరిస్థితే. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ లయ దొరకని బెన్ స్టోక్స్ సేన అడిలైడ్‌లో అయినా తిరిగి పుంజుకోవాలని తహతహలాడుతోంది. మరోవైపు 2-0 ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియా ఈ పోరుతోనే సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తోంది.

Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com




Sreemitra
TOWNSHIPS PVT. LTD.
NCD
NIKHILA CONSTRUCTIONS AND DEVELOPERS
Redefining urban homescapes
BHAMA EMPORIO
VIYARA
925 SILVER JEWELLERY
MUKUNDA JEWELLERY
FNCC
సింహగర్జన
www.simhagarjana.com
Varahi CAPTURES